క్లుప్తంగా

భవిత కేంద్రం తనిఖీ



విద్యార్థినితో మాట్లాడుతున్న అధికారులు

బనగానపల్లె రూరల్: బనగానపల్లెలోని భవిత కేంద్రాన్ని స్టేట్ అసిస్టెంట్ ఐఓ కో-ఆర్డినేటర్ రాధిక, జిల్లా కోఆర్డినేటర్ రాఘురామిరెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరుపట్టి, ఫిజియోథెరపి కార్యక్రమాలతో పాటు మధ్యాహ్న భోజనం, యూనిఫాం, జేవీడీ కిట్స్, ట్యాబ్‌లు తదితర వివరాల అడిగి తెలుసుకున్నారు. వారితో పాటు ఎంఈఓ స్వరూప, ఉపాధ్యాయులు ఇందిరా, శ్రీనివాసులు ఉన్నారు.

ఘనంగా అమావాస్య పూజలు



ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయస్వామి

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేటలో వెలసిన గాడు బావి వీరాంజనేయస్వామి, గౌరిపేట, పలక చింతమాను, కనుమలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శుక్రవారం పుష్య మాస అమావాస్య పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, సింధూర అర్చన, ఆకుపూజ, మహామంగళ హరతి నిర్వహించారు. బనగానపల్లె రహదారిలోని పుట్ట పెద్దమ్మ ఆలయం, సిమెంట్ నగర్ గ్రామంలోని పరమేశ్వరి అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

స్వచ్ఛంద సంస్థకు రూ.25 వేల విరాళం



విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: సమరసత సేవా ఫౌండేషన్ ధర్మరక్షా నిధికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి రూ.25 వేలను శుక్రవారం విరాళంగా అందజేశారు. రాయలసీమజోన్ ధర్మప్రచారక్ ఈశ్వర్ రెడ్డి, జిల్లా సంయోజక్ మాధవరెడ్డి, జిల్లా ధర్మ ప్రచారక్ శ్రీనివాసులు, సభ్యులు నాగమల్లారెడ్డి, శంకరయ్య పాల్గొన్నారు.

ఆటో హల్‌చల్



బోల్తా పడిన ఆటో

డోన్ టౌన్: పట్టణంలో ఓ ఆటోడ్రైవర్ తాగిన మైకంలో ఇష్టానుసారంగా డ్రైవింగ్ చేస్తూ పలు వాహనాలను ఢీకొన్నాడు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో శ్రీరామ్ థియేటర్ సమీపంలో అవుకు మండలానికి చెందిన డ్రైవర్ మద్యం మత్తులో ఆటోను వేగంగా నడిపాడు. బైక్‌లను ఢీకొడుతూ బోల్తా పడింది. కొందరికి స్వల్ప గాయాలు కాగా పలు బైకులు దెబ్బతిన్నాయి. స్థానికులు అతన్ని పట్టుకుని పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

తహసీల్దార్‌కు సన్మానం



విద్యాసాగర్‌ను సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

డోన్ రూరల్: బదిలీపై వెళుతున్న తహసీల్దార్ విద్యాసాగర్‌ను పట్టణంలోని షాదీఖానలో శుక్రవారం అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, జెడ్పీటీసీ సభ్యుడు రాజ్‌కుమార్‌యాదవ్, ఎంపీడీఓ శ్రీనివాసులు, న్యాయవ్యాది నాగభూషణంరెడ్డి, ఎంఈఓ ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామచంద్రుడు పాల్గొన్నారు.

భౌతికశాస్త్ర ఉపాధ్యాయినికి సత్కారం



షాహనాజ్‌బేగంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బనగానపల్లె: దక్షిణ భారత సైన్స్ ఫేర్‌లో బనగానపల్లె జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయిని షాహనాజ్‌బేగం ఉత్తమ ప్రాజెక్టు రూపొందించి ప్రతిభ కనబరచడంతో హెచ్‌ఎం బాలగంగాధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శుక్రవారం ఆమెను సన్మానించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. విజయవాడలో జనవరి 27 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు జరిగిన దక్షిణ భారత్ సైన్స్ ఫేర్‌లో షాహనాజ్ బేగం ఆటోమెటిక్ హ్యాండ్ శానిటైజర్ డిస్పెన్సరీ ప్రాజెక్టును ప్రదర్శించి బహుమతి అందుకోవడం అభినందనీయమని కొనియాడారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

- జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం
- విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ





బనగానపల్లె: విద్యార్థులకు మాత్రలు తినిపిస్తున్న మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు, రేవనూరులో..

బనగానపల్లె రూరల్: ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగులను నివారించవచ్చని.. తద్వార పిల్లల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు అన్నారు. మండలంలోని టంగుటూరు, అప్పలాపురం, కై ప గ్రామాల్లోని పాఠశాలల్లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరూ తప్పనిసరిగా మాత్రలను తీసుకోవాలన్నారు. రెండేళ్లలోపు చిన్నారులు అర్ధ మాత్ర, రెండేళ్ల నుంచి 19 ఏళ్లు కలిగిన వారు పూర్తి మాత్రను భోజనం తరువాత తీసుకోవాలని తెలిపారు. నులిపురుగులు ఉన్న వ్యక్తి మల విసర్జన ద్వారా గుడ్లు నేలలోకి.. తద్వారా తాగునీరు, గాలి ద్వారా ఆహారం పదార్థాలపై చేరుతాయన్నారు. నులిపురుగులు ఉన్న పిల్లల్లో రక్తహీనత సమస్య ఉంటుందని తెలిపారు. సరిగ్గా ఆహారం కూడా తీసుకోరని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ సోహెల్‌బాబు, ఎంపీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ అయ్యమ్మ, ఏఎన్‌ఎంలు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీ

కోవెలకుంట్ల: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని రేవనూరు పీహెచ్‌సీ పరిధిలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్‌సుభాని ఆధ్వర్యంలో 18 సంవత్సరాల్లోపు పిల్లలకు మాత్రలు వేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు గిరిజ, ప్రభావతి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

యాత్ర-2కు ప్రేక్షకుల బ్రహ్మరథం



సినిమాను తిలకిస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్

బనగానపల్లె: పట్టణంలో యాత్ర-2 సినిమాకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. థియేటర్ వద్ద అభిమానులు భారీగా చేరుకుని సందడి చేశారు. శుక్రవారం స్థానిక జీఎం టాకిస్‌లో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, అవుకు, బనగానపల్లె మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు కాటసాని తిరుపాల్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, గుండం సూర్యప్రకాష్‌రెడ్డి సినిమాను వీక్షించారు. ఇందులో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కడప ఎంపీగా గెలవడంతో మొదలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ ప్రవేశం, ఆయన పడిన కష్టాలు, పట్టుదలతో ఎదగడం వరకు పలు సన్నివేశాలు ప్రేక్షకులను ఎంతగానే ఆకర్షించాయి.


అందరి కృషితోనే వెట్టిచాకిరి నిర్మూలన



మాట్లాడుతున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్: సమాజంలో వెట్టిచాకిరి, బానిసత్వం నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసు కమిటీ చైర్‌పర్సన్ తంగమణి అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక కోర్టు ఆవరణలో శుక్రవారం బానిసత్వం నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. సమాజంలో తోటి వారిని బానిసలుగా చూసినా, నిర్బంధించినా చట్ట ప్రకారం శిక్షార్హులన్నారు. బానిసత్వ నిర్మూలన కోసం పాటుపడుదాం అని ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో కార్మికశాఖ అధికారిణి సంధ్య, న్యాయవాదులు, పలు స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్

కొలిమిగుండ్ల: ఎన్నో ఏళ్లుగా నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. మండల పరిధిలోని మీర్జాపురంలో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.50 లక్షలతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్, ఇంటింటికి కొళాయి కనెక్షన్ పనులు పూర్తయ్యాయి. ఇప్పటికే ట్రయల్ రన్ నిర్వహించారు. పనులు పూర్తి కావడంతో ఈనెల 12న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. గ్రామ పరిసరాల్లో భూగర్భ జలాలు తగినంత లేకపోవడంతో సుమారు 4కి.మీ దూరంలో బోరు వేసి పైపులైన్ సాయంతో నీటి సరఫరా అందించేవారు. దీని వల్ల తరచూ ఇబ్బందులు ఎదురవుతుండేవి. గ్రామ ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ సహకారంతో సర్పంచ్ లాయర్ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌తో పాటు గ్రౌండ్ లెవల్ సంప్ నిర్మించారు. గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చేసిన ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

కోవెలకుంట్ల: రోడ్డు పక్కల వ్యాపారాలు చేసుకునే వారు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వ్యాపారాలు చేసుకోవాలని సీఐ జయచంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో ముదిగేడు చౌరస్తా నుంచి జమ్ములమడుగు టర్నింగ్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా దుకాణాలు నిర్వహిస్తున్న వారికి రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. దుకాణాలకు వచ్చే ప్రజలు తమ ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు రోడ్డుపై నిలుపుతుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని తెలిపారు. షాపు యజమానులు రాకపోకలకు అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎస్‌ఐ వరప్రసాద్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

బేతంచెర్ల/డోన్ రూరల్: సార్వత్రిక ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని, గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని బేతంచెర్ల, డోన్ రూరల్ సీఐలు ప్రీతంరెడ్డి, అస్రత్‌బాషా అన్నారు. శుక్రవారం రాత్రి బేతంచెర్ల మండలం బుగ్గానిపల్లె, డోన్‌లోని గుమ్మకొండ గ్రామాల్లో రాత్రి బస కార్యక్రమం నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గొడవలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి

ప్యాపిలి: వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ మంచి ఆహారం తీసుకుంటే వ్యాధులు దరిచేరవని వైద్యాధికారిణి వాణిశ్రీ అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ప్యాపిలి పీహెచ్‌సీ పరిధిలో 9,378 మంది విద్యార్థులకు గాను 8656 మందికి అల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక కేజీబీవీలో విద్యార్థినులకు వైద్యాధికారిణి పలు విషయాలపై అవగాహన కల్పించారు. భోజనానికి ముందు, తర్వాత తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. రక్తహీనతకు గురికాకుండా ఉండేందుకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం నాగలక్ష్మి, వాణి, వైద్య సిబ్బంది రాఘవేంద్రగౌడు, రమాదేవి పాల్గొన్నారు.

ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం ప్రమాదకరం



కోవెలకుంట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

కోవెలకుంట్ల: ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం ప్రమాదకరమని, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని కోవెలకుంట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ తిరుపతయ్య అన్నారు. రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలో ఆర్టీసీ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదన్నారు. వాహనదారులు వేగపరిమితిని పాటించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం డిపోలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ సిబ్బందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శేఖర్, యూనియన్ నాయకులు శివరాం, గిరి, శ్రీనివాసులు, ఆచారి, నరసింహ పాల్గొన్నారు.

విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు



ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో నాయకులు

బనగానపల్లె రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చినట్లు సర్పంచ్ బండి వరలక్ష్మి, ఆ పార్టీ నేత బండిబ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని యాగంటిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి అభ్యసిస్తున్న 58 మందికి ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ట్యాబ్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్ స్థాయికి దీటుగా ప్రభుత్వ బడుల్లో వసతులు కల్పించినట్లు చెప్పారు. పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రసూల్, ఉపాధ్యాయులు రాంపుల్లారెడ్డి, జానకిరెడ్డి, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలి



మాట్లాడుతున్న ఎంఈఓ స్వరూప

బనగానపల్లె రూరల్: నాలుగేళ్ల నుంచి 15 ఏళ్లలోపు పిల్లలందరూ బడిలోనే ఉండాలని జిల్లా అలెస్కో కోఆర్డినేటర్ రఘురామిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పొదుపు భవనంలో ఎంఈఓ స్వరూప ఆధ్వర్యంలో మిషన్ జీఈఆర్‌పై బనగానపల్లె ప్రభుత్వ ఎంపీపీ, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. పలు కారణాలతో బడి మనేసిన పిల్లలు, పరిశ్రమాల్లో కూలీలుగా పనిచేస్తున్న పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో నమోదు చేయించి వందశాతం జీఈఆర్ పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల వారీగా ఎక్కడెక్కడ బడిబయట పిల్లలు ఉన్నారు.. వారిని ఏ విధంగా బడిలో చేర్పించాలి తదితర వివరాలను ఎంఈఓ స్వరూప హెచ్‌ఎంలకు వివరించారు. అవుకు ఎంఈఓ శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్, యు.కొత్తపల్లె డిగ్రీ కళాశాల ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. పట్టణంలోని మాదన్ననగర్, తారకరామనగర్, ఇందిరానగర్, వెంకటాపురం రోడ్డు సర్కిల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీకళాశాల, చిగురమానుపేట, రైల్వే స్టేషన్ ఏరియాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే 33 కేవీ జలదుర్గం, వెల్దుర్తి ఫీడర్‌ల కింద జగదుర్తి సబ్‌స్టేషన్, ఇండస్ట్రియల్ సబ్ స్టేషన్లలో రైతులకు ఇచ్చే త్రీఫేస్ విద్యుత్ ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు ఇస్తామని పేర్కొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలో విద్యుత్ ఫీడర్ మరమ్మతు పనుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏడీ మధుసూధన్‌రెడ్డి, టౌన్ ఏఈ మహబూబ్ వలి శుక్రవారం తెలిపారు. వినియోగదారులు, పరిశ్రమల యజమానులు గమనించగలరన్నారు.

14న మండల సర్వసభ్య సమావేశం

అవుకు: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 14న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు అవుకు ఎంపీడీఓ మల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. ఆయా శాఖల అధికారులు గ్రామాల్లో జరిగిన అభివృద్ధి నివేదికలను తీసుకురావాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

21 మద్యం బాటిళ్లు స్వాధీనం

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని ఇందిరమ్మ కాలనీలో బెల్ట్‌షాపు ద్వారా మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న సాయి అనే వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు. అతని వద్ద నుంచి 21 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

నేడు యథావిధిగా పాఠశాలలు

డోన్ టౌన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, యజమాన్య పాఠశాలలు శనివారం యథావిధిగా తరగతులు నిర్వహించాలని జిల్లా విద్యాధికారి సుధాకర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సంక్రాంతి సెలవులు పొడిగించినందుకు రెండో శనివారం పాఠశాలలు పనిచేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



కార్యకర్తల సమావేశంలో బుగ్గన అర్జున్‌రెడ్డి

డోన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ విజయానికి కృషి చేయాలని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తన స్వగృహంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డోన్ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సీఎం సహకారంతో డోన్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దారని తెలిపారు. ఆయన చేసిన అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని.. మరోసారి ఆయన్ను గెలిపించుకోవాలని కోరారు. ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్ టౌన్: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ గీతా తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 4వ తరగతి చదువుతున్న వారు అర్హులన్నారు. తల్లి తండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్షకు మించిన వారు అనర్హులని తెలిపారు. ఆధార్‌కార్డుతో ఇంటర్నెట్‌లో దరఖాస్తు చేసుకుని సమీప గురకుల పాఠశాలల్లో దరఖాస్తు అందజేయాలని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న వారికి మార్చి 10వ తేదీ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు స్థానిక గురుకుల పాఠశాలలో సంప్రదించాలన్నారు.

దరఖాస్తు చేసుకోండి

డోన్: పట్టణంలోని ఏపీ బీసీ గురుకుల బాలుర వసతిగృహాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ కోరారు. శుక్రవారం తన చాంబర్‌లో పాఠశాల ప్రవేశాల గురించి ప్రిన్సిపల్ గోపాల్, ఉపాధ్యాయులు మధుమోహన్‌లతో భేటీ అయ్యారు. ఐదో తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం వరకు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష రాసేందుకు ఈనెల 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్ హుసేన్, కౌన్సిలర్ మేకల విమల పాల్గొన్నారు.

ఆర్‌పీఎఫ్ అదుపులో బాలికలు



బాలికలను విచారిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ, పోలీసులు

డోన్ రూరల్: డోన్ రైల్వేస్టేషన్‌లో ఇద్దరు బాలికలను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ షంషాద్‌బేగం తెలిపారు. ఆమె వివరాల మేరకు.. అన్నమ్మయ్య జిల్లా పుల్లంపేట గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు మధురై నుంచి ఓకా ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తుండగా గుత్తి వద్ద తిరుమల్‌రెడ్డి అనే రైల్వే ఉద్యోగి ఆ ఇద్దరు బాలికలను చూసి అనుమానంతో డోన్ ఆర్‌పీఎఫ్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. రైలు డోన్ స్టేషన్‌కు వచ్చిన వెంటనే బాలికలను అదుపులోకి తీసుకుని విచారించగా పుల్లంపేట గ్రామంలోని ఏపీ మోడల్ పాఠశాలలో 9,10వ తరగతి చదువుతున్నట్లు గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు మొహంపై మత్తు స్ప్రే చేసినట్లు బాలికలు తెలిపారన్నారు. కాగా బాలికల వద్ద కడప నుంచి కాచిగూడ వరకు రైలు టికెట్ ఉందని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. తల్లిదండ్రులకు సమాచారం అందించామన్నారు. రైల్వే పోలీసుల ఆదుపులో ఉన్నట్లు తెలిపారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు



పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కును అందజేస్తున్న ప్రజాప్రతినిధులు





ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం, సభకు హాజరైన మహిళలు

ప్యాపిలి: మహిళా సాధికారతే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి అన్నారు. స్థానిక లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2019 ఎన్నికల సమయంలో పొదుపు మహిళలకు ఇచ్చిన హామీని అమలు చేశారని తెలిపారు. ప్యాపిలి మండలంలోని 927 సంఘాలకు 2020-21లో రూ.4,82,88,000, రెండో విడత 2021-22లో 932 సంఘాలకు రూ. 4,90,14,000, మూడో విడత 2022-23లో 932 సంఘాలకు రూ.4,90,14,000, నాలుగో విడతలో 2023-24కు గాను 932 సంఘాలకు రూ. 4,90,14,000 చొప్పున ప్రభుత్వం రుణ మాఫీ చెల్లించినట్లు తెలిపారు. 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు తాను అధికారంలోకి రాగానే పొదుపు మహిళల రుణాలు మాఫీ చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించారన్నారు. నాలుగు విడతల్లో పొదుపు రుణాలు మాఫీ చేస్తానని హామీ ఇచ్చిన జగనన్న ప్రస్తుతం నాలుగో విడత మహిళల ఖాతాల్లోకి నగదు జమచేశారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మహిళలు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలబడి మరోసారి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలన్నారు. అనంతరం పొదుపు మహిళలకు రుణమాఫీ చెక్కును పంపిణీ చేశారు. మహిళలు ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయిమనోహర్, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దిలీప్ చక్రవర్తి, హుసేనాపురం సింగిల్‌విండో అధ్యక్షుడు అలేబాదు బాలయ్య, ఎంఎంఎస్ సభ్యులు శివకుమారి, కృష్ణవేణమ్మ, మహాలక్ష్మి, పుల్లమ్మ, సువర్ణ పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

బేతంచెర్ల: ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆశావర్కర్స్ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి వెంకటలక్ష్మి, మండల కమిటీ సభ్యులు పుష్పావతి, అంజనమ్మ కోరారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ జీవన చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. తమకు కనీస వేతనం అందజేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

దొంగ నోటు మార్పిడి.. మహిళ అరెస్ట్

డోన్ టౌన్: దొంగనోట్లు మార్పిడి చేస్తున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన మహిళను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. నల్గొండకు చెందిన మహిళ శుక్రవారం డోన్ పాత బస్టాండ్‌లో పండ్లు విక్రయించే వృద్ధురాలి వద్ద రూ.20 విలువ చేసే పండ్లు కొని వంద రుపాయల నోటును ఇచ్చింది. నోటును పరిశీలించగా అనుమానం కలిగింది. తోటి వ్యాపారులకు విషయాన్ని చెప్పింది. వారు పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు. సదరు మహిళ ఇక్కడ పొలాలు కొనుగోలు చేయడానికి వచ్చినట్లు.. తాను స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలిగా పోలీసులకు చెప్పినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.